నేషనల్ అడ్వెంచర్ ట్రైనింగ్ క్యాంపునకు అర్హత



ప్రేంసాయిని సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్

మంచిర్యాల క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్ సీహెచ్ ప్రేంసాయి హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో జరిగే నేషనల్ అడ్వెంచర్ ట్రైనింగ్ క్యాంపునకు అర్హత సాధించారు. నవంబరు 18 నుంచి 27 వరకు జరిగే ఈ కార్యక్రమానికి ఎంపిక అవడం గర్వకారణమని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జై కిషన్ ఓఝా, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్ నరేందర్‌రెడ్డి మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజయ్య, కళాశాల సిబ్బంది గంగయ్య, గోపాలకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

15న లోక్ అదాలత్

తాండూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక లోక్ అదాలత్ కార్యక్రమం ఈ నెల 15న నిర్వహిస్తున్నట్టు తాండూర్ సీఐ దేవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. లోక్ అదాలత్ కేసుల పరిష్కారానికి అద్భుతమైన వేదిక అని తెలిపారు. క్షణికావేశంలో నమోదైన చిన్నచిన్న కేసులు, కుటుంబ కలహాలు, ఆస్తి వివాదాలు, చెక్‌బౌన్స్, చిన్నపాటి సివిల్ తగాదాలు వంటి రాజీపడే అవకాశం ఉన్న కేసులకు పరిష్కారం ఉంటుందన్నారు. తాండూర్ సర్కిల్ పరిధిలోని మాదారం, తాండూర్, భీమిని, కన్నెపల్లి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని వారు వినియోగించుకోవాలని సూచించారు.



గూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని రంగంపల్లెలో అర్ధరాత్రి టిప్పర్‌లో నింపుతున్న మొరం

విచ్చలవిడిగా మొరం తవ్వకాలు

- దండేపల్లి మండలంలో రెచ్చిపోతున్న అక్రమార్కులు
- గూడెం గుట్టలో అక్రమ తవ్వకాలు
- 50 లారీల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలింపు

మంచిర్యాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకున్నా...అక్రమంగా మొరం తవ్వకాలు జరుపుతూ లక్షలు కొల్లగొడుతున్న వ్యాపారుల ఆగడాలకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. అక్రమార్కులు అర్ధరాత్రి సమయంలో మొరం తవ్వకాలు జరుపుతూ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. అక్రమార్కుల ధన దాహానికి కొండలు, గుట్టలు కరిగిపోతుండగా, నిత్యం లక్షల రూపాయలు చేతులు మారుతున్నాయి. దండేపల్లి మండలంలో ఈ అక్రమ బాగోతం కొద్ది నెలలుగా యథేచ్ఛగా జరుగుతోంది.

దండేపల్లి మండలం గూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని రంగంపల్లె శివారు సర్వే నంబరు 444లోని ప్రభుత్వ స్థలంలో కొద్ది రోజులుగా కొందరు వ్యాపా రులు అక్రమంగా మొరం తవ్వకాలు చేపడుతున్నారు. అర్ధరాత్రి సమయంలో మొరం తవ్వకాలు జరుపుతూ టిప్పర్ల ద్వారా గుట్టు చప్పుడు కాకుండా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నిత్యం సగటున 50 లారీ ల ద్వారా మొరాన్ని తరలిస్తూ ఒక్కో ట్రిప్పును 5,000 రూపాయల వరకు రియల్ ఎస్టేట్ వెంచర్లకు విక్రయి స్తున్నట్లు తెలుస్తోంది.

ప్రతి రోజూ నిర్వహిస్తున్న అక్రమ దందా కారణంగా కనీసం రెండు లక్షల రూపాయల మేర చేతులు మారుతున్నట్టు సమాచారం. వ్యాపారుల ధన దాహం కారణంగా ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతుండగా, అక్రమార్కుల జేబులు నిండుతున్నాయి. ఈ అక్రమ దందా వెనుకాల కొందరు రాజకీయ నాయకుల హస్తం ఉన్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. నాయకుల ప్రమే యం ఉన్న కారణంగానే సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.

నాణ్యమైన మొరం కావడంతో....

దండేపల్లి రంగంపల్లెలో లభ్యమవుతున్న మొరం నాణ్యతతో కూడుకున్నది కావడంతో పెద్దఎత్తున డిమాండ్ ఉంది. ఆ మొరాన్ని రోడ్లకు ఉపయోగిస్తే వర్షాకాలంలో బురదమయం కాకుండా..

(మిగతా 7లో..)

అండాళమ్మ కాలనీలో ట్రాక్టర్ సీజ్..

ఇదిలా ఉండగా జిల్లా కేంద్రంలోని అండాళమ్మ కాలనీ సమీపంలోగల జాలా గుట్టలో అక్రమంగా మొరం, బండరాళ్లను తరలిస్తున్న ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. 'కరిగిపోతున్న జాలా గుట్ట' శీర్షికన ఈ నెల 8న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. కథనంపై స్పందించిన తహసీల్దార్ రఫతుల్లా ఖాన్ ఆదేశాల మేరకు మరునాడు రెవెన్యూ సిబ్బంది సంఘటన స్థలం వద్ద మాటు వేశారు. గుట్టలో అక్రమంగా తవ్విన బండరాళ్లను తరలిస్తున్న ఓ ట్రాక్టర్ తారసపడటంతో సిబ్బంది దాన్ని సీజ్ చేసి, స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమానికి రూ 5000 జరిమానా విధించి వదిలిపెట్టారు. ఈ విషయమై పోలీసులు, రెవెన్యూ అధికారులపై కొందరు నాయకులు ఒత్తిడి తేవడంతోనే సీజ్ చేసిన వాహనాన్ని వదిలిపెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే జాలా గుట్టలో తవ్విన మొరాన్ని స్థానికంగా మసీదు పక్కన నిలువ చేయగా, సమాచారం అందుకున్న రెవెన్యూ సిబ్బంది దాన్ని సీజ్ చేశారు. సీజ్ చేసిన మొరాన్ని గుట్టు చప్పుడు కాకుండా రాత్రికిరాత్రే అక్కడి నుంచి తరలించి విక్రయించడం కొసమెరుపు.



ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించిన రెవెన్యూ సిబ్బంది

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

కలెక్టర్ కుమార్ దీపక్



జిల్లా స్థాయి క్రీడలను ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

లక్షెట్టిపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపుతూ క్రీడల్లో రాణించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మహాత్మా జ్యోతిబాఫూలే బాలుర పాఠశాల మైదానంలో ఏర్పాటుచేసిన జిల్లాస్థాయి క్రీడాపోటీల ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి క్రీడారంగంలో రాణిస్తూ సామాజిక దృక్పథం కలిగి ఉండాలన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీర దారుఢ్యాన్ని పెంపొందిస్తాయని, నాయకత్వ లక్షణాలు అలవడుతాయన్నారు. క్రీడలు ఆడటం వల్ల చదువులో ఏకాగ్రత కూడా పెరుగుతుందని తెలిపారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని ప్రతీ క్రీడాకారుడు స్నేహపూర్వకంగా నడుచుకుంటూ క్రీడల్లో పాల్గొనాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ చంద్రయ్యతో కలిసి క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మంగ, సంబంధిత అధికారులు, క్రీడాకారులు, పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధికి అబుల్ కలాం ఆజాద్ కృషి

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా విద్యారంగ అభివృద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఎనలేని కృషి చేశారని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఆజాద్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్వాతంత్ర్య పోరాటంలో కీలకపాత్ర పోషించారన్నారు. భారత దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా విద్యారంగం అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రయ్య, జిల్లా మైనార్టీ అధికారి రాజేశ్వరి పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో తనిఖీలు



మంచిర్యాల రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఏసీపీ, సీఐ

మంచిర్యాల క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో బాంబు పేలుళ్ల సందర్భంగా మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో ఏసీపీ ప్రకాష్, సీఐ ప్రమోద్‌రావు సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచితుల పట్ల ఏదైనా అనుమానం వస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు, రైల్వే, బస్ స్టేషన్లలో అనుమానాస్పదంగా ఉన్న వస్తువులు, బ్యాగులు, సూట్‌కేసులు వంటివి ఏవి కనిపించినా సమాచారం ఇవ్వాలన్నారు. రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల వివరాలను అడిగి తెలుసుకొని వారిని క్షుణ్ణంగా పరిశీలించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



మాట్లాడుతున్న లాల్‌కుమార్

లక్షెట్టిపేట, నవంబరు, 11(ఆంధ్రజ్యోతి): పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజ్ రీయింబర్స్‌మెంటును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. లక్షెట్టిపేట పట్టణంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘ (పీడీఎస్‌యూ) ఏరియా మహాసభలను పార్టీ నాయకులు మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తలుగా పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఆజ్మీర లాల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి శంకరి సత్యం వ్యవహరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటుకు వ్యతిరేకంగా ప్రతీఒక్కరూ పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యపై అవలంబిస్తున్న తీరును తీవ్రంగా ఖండించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు విద్యారంగానికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజ్ రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు సికందర్, నాయకులు కార్తీక్, వంశీ, అంజి, సంజయ్, శివరాం, రోహిత్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమం కోసమే కొనుగోలు కేంద్రాలు



లక్షెట్టిపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

లక్షెట్టిపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసమే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. లక్షెట్టిపేట మున్సిపాలిటీలోని మోదెల, ఇటిక్యాల, గంపలపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రం నిర్వహకులు ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా చేపట్టాలని రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని ఆదేశించారు. కేంద్రాల్లో రైతులకు సరిపడా గన్ని సంచులతో పాటు టార్పాలిన్ కవర్లను కూడా అందుబాటులో ఉంచుకోవాలని, కేంద్రాల్లో దొడ్డురకం, సన్నరకం ధాన్యం రెండు కొనుగోలు చేస్తామన్నారు. సన్నరకం ధాన్యానికి మద్దతు ధరతో పాటు 500 రూపాయల బోనస్ ప్రభుత్వం అందజేస్తోందన్నారు. కార్య క్రమంలో అదనపు కలెక్టర్ చంద్రయ్య, తహసీల్దార్ దిలీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్ విజయ్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేమ్‌చంద్, వైస్‌చైర్మన్ ఆరీఫ్ పాల్గొన్నారు.

వయోవృద్ధుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

మంచిర్యాల కలెక్టరేట్: వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ కుమా ర్ దీపక్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం 2025 పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఈ నెల 12న వారోత్సవాల ప్రారంభం, 13న ఆట పాటలు, వినోద కార్యక్రమాలు, 14న ఉచిత ఆరోగ్య శిబిరాలు, 15న వయో వృద్ధుల హక్కులపై అవగాహన ర్యాలీ, 17న జిల్లా స్థాయిలో వృద్ధుల చట్టాలు, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం, 18న గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు, 19న రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వృద్ధులు తమ పోషణ, ఇతర ఫిర్యాదుల కోసం హెల్ప్ లైన్ 14567లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరావు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్‌ఖాన్ పాల్గొన్నారు.

జాతీయరహదారిపై పేరుకుపోయిన ఇసుక

- వాహనదారులకు ఇబ్బందులు

నస్పూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ నుంచి శ్రీరాంపూర్ వరకు మధ్య ఉన్న 63వ జాతీయ రహదారికి ఇరువైపుల మట్టి, ఇసుక, చెత్తచెదారం ఉండడంతో వాహనాల చోదకులకు ఇబ్బందికరంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా ఇసుక, మట్టి చేరడంతో వాహనాల రాకపోకల వలన దుమ్ము వస్తోంది. ద్విచక్ర వాహనదారుల కళ్లలో దుమ్ము పడి నానా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఎక్కువ ఇసుక ఉన్న ప్రాంతంలో ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. రోడ్డుపై ఉన్న చెత్తాచెదారం, ఇసుక, మట్టి ధూళిని శుభ్రం చేయడానికి గతంలో మున్సిపాలిటి నుంచి దాదాపు పది లక్షల రూపాయల వ్యయంతో స్వీపింగ్ మిషన్ కొనుగోలు చేశారు. అయినప్పటికీ రోడ్డుపై దుమ్మూధూళిని సకాలంలో శుభ్రం చేయలేకపోతున్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇసుక, మట్టిని సకాలంలో తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.



సీసీసీ కార్నర్ వద్ద జాతీయ రహదారిపై పేరుకుపోయిన మట్టి, ఇసుక

సిబ్బందికి స్వీయ క్రమశిక్షణ అవసరం

సీపీ అంబర్ కిషోర్ ఝా



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీపీ

మంచిర్యాల క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బందికి వ్యక్తిగత భద్రతతో పాటు స్వీయ క్రమశిక్షణ అవసరమని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. ఈ సందర్భంగా ఆయన కమిషనరేట్ కార్యాలయంలో మాట్లాడుతూ పోలీసులు తమ సమస్యలను నమ్మకంగా పంచుకోవడం, అవసరమైతే సహాయం కోరడం అనేది బలహీనత కాదని, అది మానసిక ధైర్యానికి సంకేతమని అన్నారు. నిరంతరం ప్రజాసేవలో నేర నిరోధక కార్యక్రమాల్లో నిమగ్నమై అధిక పని ఒత్తిడి, వ్యక్తిగత సమస్యలు, చెడు అలవాటు వంటి కారణాలతో కొంత మంది సిబ్బందితో మానసిక ఆందోళన, నిస్పృహ పెరుగుతోందన్నారు. స్వీయ క్రమశిక్షణ, ప్రవర్తన నియమావళిపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో వైద్య నిపుణుల సహకారంతో అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ శ్రీనివాస్, ఎంవీఐ సంతోష్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచి ఏసీపీ నాగేంద్రగౌడ్ పాల్గొన్నారు.

నేటి నుంచి పత్తి కొనుగోళ్లు

చెన్నూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) :చెన్నూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని ఆదివార్‌పేటలోని జీఆర్ఆర్ ఇండస్ట్రీస్‌లో బుధవారం నుంచి సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు ప్రారంభమవుతాయని చెన్నూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఓదెలు ఒక ప్రకటనలో తెలిపారు. పత్తి రైతులందరు తప్పనిసరిగా కపాస్ కిసాన్‌యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకుని మాత్రమే సీసీఐకి అమ్మడానికి తీసుకురావాలని సూచించారు. పత్తిలో 8 శాతం నుంచి 12 శాతం తేమ మించకుండా చూసుకోవాలన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

డీఈవో ఎస్ యాదయ్య



వెల్గనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థుల ప్రతిభను పరిశీలిస్తున్న డీఈవో యాదయ్య

దండేపల్లి నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రతిరోజు ప్రత్యేక తరగతుల ద్వారా నాణ్యమైన విద్యను అందించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని జిల్లా విద్యాధికారి ఎస్ యాదయ్య సూచించారు. దండేపల్లి మండలం వెల్గనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఉదయం వేళలో విద్యార్థులకు అందించే రాగిజావా పంపిణీ తీరును పరిశీలించారు. అనంతరం తరగతి గదికి వెళ్లి పదో తరగతి విద్యార్థులకు అందించే విద్యాబోధన తీరును పరిశీలించి, వారి ప్రతిభ సామర్థ్యాలను పరిశీలించారు. ఎస్ఏ1 పరీక్షలో వచ్చిన మార్కుల తీరు నేరుగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఈవో మాటాడుతూ టెన్త్ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని వార్షిక పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. చదువులో వెనకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనం అలందించాలన్నారు. ముందుగా మధ్యాహ్న భోజనశాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల హాజరుపట్టిక, ఉపాధ్యాయుల విద్యాబోధన తీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు బొలిశెట్టి రాజన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

నేడు నియోజకవర్గంలో మంత్రి వివేక్ పర్యటన



జైపూర్‌లోని కేజీబీవీ జూనియర్ కళాశాల

చెన్నూరు/జైపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి బుధవారం చెన్నూరు నియోజకవర్గంలో పర్యటించారు. భీమారంలో కస్తూర్బా పాఠశాల నూతన భవనం, శివలింగాపూర్‌లో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం, దేవులవాడలో నూతన సబ్ సెంటర్ భవనాన్ని ప్రారంభిస్తారని నాయకులు తెలిపారు. జైపూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలకు అనుబంధంగా నిర్మిస్తున్న జూనియర్ కళాశాల భవనం నిర్మాణం పూర్తి అయ్యింది. బుధవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి భవనాన్ని ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

మంచిర్యాల డీసీపీ భాస్కర్

మందమర్రిరూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలందరు సహకరించాలని మంచిర్యాల డీసీపీ భాస్కర్ కోరారు. సోమవారం రాత్రి మందమర్రి మండలంలోని రామకృష్ణపూర్‌లో కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు నగర్‌లో ఇళ్లలో సోదాలు చేసి సరైన పత్రాలు లేని 31 వాహనాలను పట్టుకుని జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలన్నారు. గుడుంబా అమ్మినా, తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా కొత్త వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రజల రక్షణ కోసమే పోలీసులు పనిచేస్తున్నారన్నారు. ఏదైనా ఆపద వస్తే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. వాహనదారులు వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలందరు సహకరించాలని కోరారు. బెల్టుషాపులు, గుడుంబా అమ్మకందారుల ఇళ్లపై దాడులు చేసి మద్యం, గుడుంబా పట్టుకుని నిందితులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, మందమర్రి, రామకృష్ణపూర్ ఎస్ఐలు రాజశేఖర్, రాజశేఖర్ పోలీసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

గుర్తు తెలియని వృద్ధుడి మృతి


మృతి చెందిన వృద్ధుడు

కాగజ్‌నగర్ టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లోని ఒకటో ప్లాట్‌ఫాంపై గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సురేష్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 8న బెల్లంపల్లి నుంచి కాగజ్‌నగర్ వరకు గుర్తు తెలియని వృద్ధుడు రైలులో వచ్చినట్లు టికెట్టు ఉన్నది. తిరిగి 11న మంగళవారం కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ నుంచి మహారాష్ట్ర బల్హార్షకు జనరల్ టికెట్ కొనుగోలు చేశాడు. బల్హార్ష వెళ్లే రైలు ఎక్కకుండా ప్లాట్‌ఫాంపై గల ఫుట్ ఓవర్ బ్రిడ్జి కింద పడుకొని మృతి చెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. మృతుని ఎడమ ఛాతిపై పచ్చబొట్టు ఉందని తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు 9948481902, 8712658596 నంబర్‌కు సమాచారం అందజేయాలని రైల్వే పోలీసులు వివరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని రైల్వే పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

హాజీపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్ణమా మిడి గ్రామ పంచాయతీ పరిధిలోని కొండపల్లిలో ట్రాక్టర్ బోల్తా పడి సల్లం శ్రీనివాస్ (43) డ్రైవర్ మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సల్లం శ్రీనివాస ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రోజువారీగా విధుల్లో భాగంగా అదే గ్రామానికి చెందిన కొట్టె తిరుపతి వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం వడ్లను పొలం నుంచి కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్తున్న సమయంలో గ్రామ శివారులోని మూల మలుపు వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి పల్టీ కొట్టింది. దీంతో ట్రాక్టర్ కింద పడిన శ్రీనివాస్ సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. ట్రాక్టర్ యజమాని పరిహారం చెల్లించాలని శ్రీనివాస్ కుటుంబసభ్యులు ధర్నా చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ధర్నా చేస్తున్న కుటుంబసభ్యులను సముదాయించడంతో ఆందోళన విరమించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు, కొడుకు ఉన్నారు.

అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడి సస్పెన్షన్

నెన్నెల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన గుండ్లసోమారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సైన్సు ఉపాధ్యాయుడు షేక్ ఖాదర్‌ను అధికారులు సస్పెండ్ చేశారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం బానేష్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ మేరకు మంగళవారం డీఈవో యాదయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. ఖాదర్ తరగతి గదిలో విద్యార్థినుల పక్కన కూర్చోవడం, పైన చేతులు వేయడం లాంటి వెకిలి చేష్టలకు పాల్పడుతున్నాడని గ్రామస్థులు డీఈవోకు ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రులకు చెబితే పరీక్షల్లో ఫెయిల్ చేస్తానని బెదిరించేవాడని పేర్కొన్నారు. డీఈవో ఆదేశాల మేరకు అడాడమిక్ మానిటరింగ్ అధికారి సత్యనారాయణ మూర్తి, పీజీ హెచ్‌ఎం పద్మశ్రీ విచారణ చేపట్టారు. విద్యార్థినులతో, గ్రామస్థులతో మాట్లాడి వివరాలు సేకరించారు. నివేదికను ఉన్నతాధికారుకు సమర్పించారు. నివేధిక ఆధారంగా ఉపాధ్యాయుడు, హెచ్‌ఎంలపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. చిత్తాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఖాదర్‌కు పోస్టింగ్ కాగా గుండ్లసోమారం ఉన్నత పాఠశాలలో డిప్యూటేషన్‌పై పని చేస్తున్నాడు.

బస్టాండ్ విస్తరణ జరిగేనా..?

పెరిగిన రద్దీ.. సరిపోని ప్లాట్‌ఫాంలు
ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు


ఆసిఫాబాద్ బస్‌స్టేషన్‌లో ప్రయాణికులు

ఆసిఫాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా ఏర్పడిన తరువాత జిల్లా కేంద్రానికి ప్రయాణికుల తాకిడి పెరిగడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పిస్తుండడంతో బస్టాండులో రద్దీ పెరిగింది. కానీ ఆ మేరకు వసతులు మాత్రం కరువయ్యాయి. జిల్లాలో ఉన్న ఏకైక బస్ డిపో ఆసిఫాబాద్. జిల్లా కేంద్రంలో ఉన్న బస్టాండ్ లో రద్దికి తగినంత సదుపాయాలు లేవు. ప్రజలు తమ వ్యక్తిగత అవసరాల కోసం జిల్లా కేంద్రాన్ని సందర్శిస్తుండడం,మండలాలు,గ్రామాలనుంచి జిల్లా కేంద్రానికి తరుచు రాకపోకలు చేస్తుండటంతో బస్టాండ్‌లో రద్దీ రోజు రోజుకు పెరుగుతున్నది.. అయితే బస్టేషన్‌లో కేవలం ఐదు ప్లాట్ ఫాంలు మాత్రమే ఉండడంతో ప్రయాణికుల రద్దీ సమయాల్లో నీడ కల్పించలేని పరిస్థితి కొనసాగుతోంది. బస్టేషన్ విస్తరణ కోసం ఆర్టీసీ అధికారులు దృష్టి సారించక పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

మారుమూల మండలాల ప్రజలు..

గతంలో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంగా ఉన్నప్పుడు బెజ్జూరు, కౌటాల వంటి మారుమూల మండలాలకు చెందిన ప్రజలు తమ వ్యక్తిగత అవసరాల కోసం ఆదిలాబాద్‌కు చేరేందుకు ఆసిఫాబాద్, మంచిర్యాల మీదుగా ఆదిలాబాద్‌కు వెళ్లేవారు. కానీ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం కావడంతో ఆదిలాబాద్‌కు రద్దీ భారీగా పడిపోయినట్లు ఆర్టీసీ సిబ్బంది చెబుతున్నారు. అదే సమయంలో ఆసిఫాబాద్‌కు క్రమంగా రద్దీ పెరుగుతున్నందున డిపో ఆదాయం కూడా పెరిగింది.

జిల్లాగా మారిన తరువాత అన్ని మండలాల నుంచి ప్రజలు ప్రభుత్వ పరమైన కార్యకలాపాల కోసం జిల్లా కేంద్రానికి ప్రజలు తరలి వస్తున్నారని చెప్పవచ్చు. మరీ ముఖ్యంగా సోమ, శనివారాల్లో రద్దీ అధికంగా ఉన్నట్లు ఆర్టీసీ సిబ్బంది చెబుతున్నారు. ఆసిఫాబాద్ డిపో నుంచి ప్రతి రోజు అన్ని రూట్లలలో 81 షెడ్యూళ్లు 89 బస్సులను ఆయా పట్టణాలు, గ్రామాలు, శివారు గ్రామాలకు బస్సు సర్వీసులు నడుపుతోంది. సగటున ప్రతి రోజు 33,700 కిలోమీటర్లు ఆర్టీసీ బస్సులు సేవలు అందిస్తుండగా ఇందులో 30 వేల మంది ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. ప్రతీరోజు డిపోకు రూ 20 లక్షల ఆదాయం సమకూరుతోంది. అధికారులు స్పందించి ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వసతులు పెరగలేదు..:చిరంజీవి, ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంగా ఏర్పడి ఎనిమిదేళ్లు గడిచిన బస్టాండులో కనీస వసతులు మెరుగు పడలేదు. దూర ప్రాంతాల నుంచి నిత్యం వేల సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్టాండు విస్తరణ చేపట్టాలి. మౌలిక సదుపాయాలు కల్పించకపోతే సమస్యలు మరింత పెరిగే ఆవకాశం ఉంది. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కాగజ్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి అన్నారు. కాగజ్‌నగర్‌లో మంగళవారం టీఎస్‌యూటీఎఫ్ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పాఠశాలల్లో ఇప్పటికే పర్యవేక్షణ కోసం మండలానికి ఒక ఎంఈవో, కాంప్లెక్సు హెడ్మాస్టర్లు, ఎంఎన్‌వోలు ఉన్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇతర జిల్లా అధికారులు కూడా పర్యవేక్షణ చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. పెండింగ్ సమస్యలు చాలా ఉన్నాయని, ప్రభుత్వం వీటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో మహిపాల్, మహేష్, బాలకృష్ణ, రంజిత్, భరత్, సబితా, రామకృష్ణ, సంతోష్, సురేందర్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

రెబ్బెన, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని పౌరాఘాడ్ క్షేత్రం వద్ద ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహించే గోర్ మాలవ్ కార్యక్రమ పోస్టర్ల మంగళవారం బంజార సంఘం నాయకులు రమేష్ నాయక్, రవినాయక్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో విద్య, ప్రేమ్‌నాయక్, రోహిదాస్, దేవయ్య, ప్రదీప్, నాగేందర్ కుమార్, రామకృష్ణ, నాగేష్, రిషికుమార్, ఆకాష్, వంశీకృష్ణ, కిరణ్ అవినాష్, రాజేందర్, సురేష్, శ్రీధర్ పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి


మాట్లాడుతున్న జీఎం విజయభాస్కర్‌రెడ్డి

రెబ్బెన, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. గోలేటిలోని సింగరేణి ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షిక పరీక్షలుకు విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ సాధన చేయాలన్నారు. భారత తొలి విద్యాశాఖ మంత్రి అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించనున్నామని చెప్పారు. అనతరం విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో స్వచ్ఛత కార్యక్ర మం నిర్వహించారు. గంటపాటు శ్రమదానం చేసి గడ్డి, ముళ్ల పొదలను తొలగించారు. కార్యక్రమంలో ఎస్‌టు జీఎం రాజమల్లు, డీజీఎం ఎస్‌కె మదీనా భాష, ప్రధానోపాధ్యాయులు రవితేజ, కరస్పాండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

వాంకిడి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బంబార ఆశ్రమ పాఠశాల, కేజీబీవీ పాఠశాలలో భరోసా టీం ద్వారా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భరోసా టీం ఇన్‌చార్జి మహిళా ఎస్సై తిరుమల మాట్లాడుతూ అత్యాచార బాధితులకు భరోసా సెంటర్ అండగా ఉంటుందని చెప్పారు. భరోసా సెంటర్‌లో బాధితులకు లభించే సేవల గురించి వివరించారు. బాలికులకు సేఫ్ టచ్, అన్ సేఫ్ టచ్, ఫోక్సో చట్టం గురించి వివరించారు. విద్య ద్వారానే సమాజంలో ఉన్నత స్థాయి చేరుకోవచ్చని అన్నారు. బాలికలకు సెల్ఫ్‌కాన్ఫిడెన్స్‌తో ఎలా ముందుకు వెళ్లాలో వివరిం చారు. అత్యవసర సమయంలో డయల్ 100కు లేదా భరోసా సెంటర్ 8712670561 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో భరోసా టీం సభ్యులు, కౌన్సిలర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులను త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, పాల్గొన్న అధికారులు

ఆసిఫాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతంగా చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని వీసీ హాల్ నుంచి అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి జిల్లాలోని ఎంపీడీవోలు, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లు, విద్యాశాఖాధికారులు, గృహ నిర్మాణ శాఖాధికారులతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు, నర్సరీలలో మొక్కల పెంపకం, ఈ నెల 14న పాఠశాలలో పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహణ అం శాలపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుపేదల కోసం ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధి పొందిన వారు పనులు త్వరగా పూర్తి చేసే విధంగా సంబంధిత అధికారులు పర్యవేక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వర్షాకాలం పూర్తి అయినందున ప్రతి లబ్దిదారుడి ఇంటి నిర్మాణం ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇళ్ల నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించేలా గృహ నిర్మాణ శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. రెండు రోజులలో లబ్ధి పొందిన ప్రతి లబ్ధిదారుడు పనులు ప్రారంభించాలని ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు పనులు ప్రారంభించేలా అధికారులు పర్యవేక్షిం చాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్య వహించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. 2026 సంవత్సరం వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 52 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్దేశిం చామని అన్నారు. ఇందులో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలో లక్ష్యానికి అనుగుణం గా నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలు పెంచేందుకు కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. అవసరమైన మట్టి, విత్తనాలను సేకరించాలని తెలిపారు. ఈ నెల 14న ప్రతి ప్రభుత్వ యజ మాన్య ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించాలని అన్నారు. పాఠశాలల అభివృద్ధికి చేపడుతున్న చర్యలపై వివరించాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు వందశాతం సమావేశానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ జాస్తిన్ జోల్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, గృహ నిర్మాణ శాఖ పీడీ ప్రకాష్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, ఎంపీడీవోలు, ఎంఈవోలు, ఏపీవోలు తదితరులు పాల్గొన్నారు.

క్వార్టర్ల కోసం ఉద్యోగుల కౌన్సెలింగ్

శ్రీరాంపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చేంజ్ ఆఫ్ క్వార్టర్స్ కోసం శ్రీరాంపూర్‌లోని సీఈఆర్ క్లబ్‌లో మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏరియాలో ఉన్న 366 క్వార్టర్లకుగాను 231 మంది ఉద్యోగులను కౌన్సెలింగ్‌కు పిలిచారు. ఇందులో 43 మంది ఉద్యోగులు హాజరై క్వార్టర్లను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ ఇంజనీర్ గుండేరావు, సీనియర్ పీవో సురేందర్, ఎస్టేట్స్ అధికారి మహేష్, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే మధుమేహం నివారణ

శ్రీరాంపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే మధుమేహ నివారణ సాధ్యమని సింగరేణి వైద్యుడు డాక్టర్ మురళీధర్ అన్నారు. ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆర్కే 7 గనిపై వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఉద్యోగులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రతి ఏడాది నవంబర్ 14న ప్రపంచ మధుమేహ దినోత్సవం నిర్వహించుకుంటారని, షుగర్ ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమందిని ప్రభావితం చేస్తోందని అన్నారు. అవగాహనతోనే షుగర్‌ను రాకుండా కాపాడుకోవచ్చన్నారు, వ్యాయామం తప్పనిసరిగా చేయాలన్నారు. ఆరోగ్యకరమైన అలవాట్లతో వ్యాధులు రాకుండా చూసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో గని మేనేజర్ తిరుపతి, ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు,, రక్షణాధికారి సంతోష్‌రావు, పిట్ ఇంజనీర్ ప్రవీణ్, అండర్ మేనేజర్లు రాము, రవీందర్, రాజు, రవితేజ, నరేష్, సుమ, సంక్షేమాధికారి సంతన్, సహాయ పిట్ కార్యదర్శి సదానందం పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ బలరాం

శ్రీరాంపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల పరిష్కారానికి తాము ఎల్లవేళలా సిద్ధంగా ఉన్నామని సింగరేణి సీఎండీ ఎన్ బలరాం అన్నారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో మంగళవారం నిర్వహించిన 38వ సంప్రదింపుల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు సూచించిన విధంగా మెడికల్ అటెండెన్స్ విధులు సరళతరం చేస్తామన్నారు. అధికారులకు, కార్మికులకు రావాల్సిన పదోన్నతులు జాప్యాన్ని నివారిస్తామన్నారు. ఉద్యోగుల కు చార్జిషీట్లు జారీ అయిన పక్షంలో నిర్ణీత వ్యవధితో వాటిపై విచారణను పూర్తిచేసే లా కృషి చేస్తామన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, కనీస వేతనాల సలహా మండలి రాష్ట్ర చైర్మన్ జనక్ ప్రసాద్, అధికారుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీపతిగౌడ్ సూచించిన అనేక సమస్యలపై ఎన్ బలరాం సానుకూలంగా స్పందించారు. త్వరలో జరుగనున్న 100కు పైగా బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొంటామని, లాభసాటిగా ఉండే కనీసం 10 బొగ్గు బ్లాకులను సాధిస్తామనే నమ్మకం ఉందన్నారు. సింగరేణిని 100 మిలియన్ టన్నుల ఉత్పత్తి సంస్థగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని, ఇందుకు కార్మిక సంఘాలు పూర్తిగా సహకరించాలని కోరారు. ముఖ్యంగా పని సంస్కృతి మెరుగుపడాల్సిన అవసరం ఉందని పునరుద్ఘాటించారు. సంస్థను కేవలం బొగ్గు ఆధారిత కంపెనీగా మాత్రమే కాకుండా బహుళ వ్యాపార విస్తరణ చర్యలు చేపట్టనున్నట్లు వివరించారు. అంతర్జాతీయంగా ఐదు దేశాల్లో విస్తరించనున్నట్లు చెప్పారు. కీలక ఖనిజ రంగంలో పనిచేయడానికి ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ (పర్సనల్) గౌతమ్ పొట్రు, డైరెక్టర్లు ఎల్‌వీ సూర్యనారాయణ(ఆపరేషన్స్), కె. వెంకటేశ్వర్లు(ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్), ఎం. తిరుమల రావు(ఈ అండ్ ఎం), జీఎం (కోఆర్డినేషన్) టి శ్రీనివాస్, జీఎం(పర్సనల్) ఐఆర్, పీఎం కవితానాయుడు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగులు క్రీడల్లో ప్రతిభ చాటాలి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులు క్రీడల్లో ప్రతిభ చాటాలి శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. శ్రీరాంపూర్ ఏరియా వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కబడ్డీ జట్టు క్రీడాకా రులకు ప్రగతి మైదానంలో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ నెల 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు కొత్తగూడెం ఏరియాలోని రుద్రంపూర్‌లో జరిగే కోల్ ఇండియా పోటీలకు శ్రీరాంపూర్ క్రీడాకారులు ఎంపిక కావడం సంతోషదాయకమన్నారు. కోచ్ సూచనల మేరకు నైపుణ్యాన్ని మెరుగుపర్చు కొని ప్రతిభ చూపాలన్నారు. నిరంతర సాధనతో విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. సింగరేణి యాజమాన్యం క్రీడలకు పెద్ద పీట వేస్తోందని చెప్పారు. ఆటగాళ్లు సైతం అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జీఎం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, డీజీఎం(పర్సనల్) అనిల్ కుమార్, క్రీడల గౌరవ కార్యదర్శి పాల్ సృజన్, సూపర్‌వైజర్ చాట్ల అశోక్, కోఆర్డినేటర్ నర్సయ్య, జనరల్ కెప్టెన్ శ్రీనివాస్, ఇండోర్ కెప్టెన్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి సమాచారం

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న జీఎం రాధాకృష్ణ

మందమర్రిటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని మందమర్రి జీఎం రాధాకృష్ణ అన్నారు. స్థానిక సీఈఆర్ క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన ప్రాచీన యోగా దినచర్య కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఎండీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబం, సమాజం బాగుంటుందన్నారు. కార్మికులందరు యోగా, ధ్యానం, వాకింగ్ చేయాలన్నారు. ప్రస్తుతం పెరు గుతున్న యాంత్రిక యుగంలో రోగాలు కూడా పెరుగుతున్నాయన్నారు. చాలా మంది గుండె నొప్పి తదితర వ్యాధులతో మృతి చెందుతున్నారన్నారు. ప్రధానంగా సింగరేణి ఉద్యోగులు మద్యం, ధూమపానంకు దూరంగా ఉండాలని చెప్పారు. పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. ప్రతి రోజు శారీరక శ్రమ అవసరమని చెప్పారు. ఇందుకోసం క్రీడలు ఆడాలన్నారు. కార్మికుల సంక్షేమం, ఆరోగ్యం కోసం యాజమాన్యం చర్యలు తీసుకుంటుందన్నారు. సింగరేణి పాఠశాల మైదానంలో రూ. 15 లక్షలతో యోగా కేంద్రాన్నిఏర్పాటు చేశామని చెప్పారు. రోజువారీగా గనులపై యోగా కార్యక్రమాలు కొనసాగుతా యన్నారు. 15 సంవత్సరాలుగా యోగాపై శాస్త్రీయ పరిశోధన కలిగి ఉన్న యోగా శిక్షకుడు శణ్ముక శివచంద్రతో శిక్షణ అందిస్తామని తెలిపారు. అనంతరం యోగా శిక్షకుడు శణ్ముక శివచంద్రకు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం లలిత్‌ప్రసాద్, ఏఐటీ యూసీ బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ మల్లేష్, అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ చౌరస్తా వద్ద రాడ్డు తొలగింపు

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

నస్పూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ కాలనీ తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద ప్రమాదకరంగా ఉన్న ఇనుప బోర్డు, రోడ్డుకు అడ్డంగా ఉన్న ఇనుప రాడ్డును మంగళవారం అధికారులు తొలగించారు. 'ఆదమరిస్తే ప్రమాదమే' అనే శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం ఉదయం వాటిని తొలగించారు. సమస్య పరిష్కారం అయ్యే విధంగా కృషి చేసిన ఆంధ్రజ్యోతికి పలువురు ధన్యవాదాలు తెలిపారు.

నియామకం

జైపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కళావేదిక మంచిర్యాల జిల్లా సాంస్కృతిక విభాగం కార్యదర్శిగా చిప్పకుర్తి శ్రీనివాస్ నియమించినట్లు శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ సీఈవో కళారత్న కత్తిమండ ప్రతాప్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాను చిత్రకళలో చేస్తున్న సేవలను గుర్తించి తనను నియమించారని, జిల్లా సాంస్కృతికి విభాగానికి మంచి గుర్తింపు తీసుకువస్తానని శ్రీనివాస్ తెలిపారు. తన నియామకానికి కృషిచేసిన ప్రతాప్‌కు, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీభూషణం, రాష్ట్ర అధ్యక్షురాలు కట్ట భాగ్యలక్ష్మీకి కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్ఎస్ఎస్ శిబిరం

చెన్నూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం శివలింగాపూర్‌లో జాతీయ సేవా పథకంలో భాగంగా శీతాకాల శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎంఈవో దత్తకుమార్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు సేవా భావాన్ని అలవర్చుకోవాలని, సమాజంలో మూఢనమ్మకాలను పారద్రోలాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పట్వర్ధన్, వైస్ ప్రిన్సిపల్ కిశోర్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సర్వర్ పాషా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రాథమిక పాఠశాలలో తహసీల్దార్ కార్యాలయం


గుంతలమయంగా మండల కేంద్రానికి వెళ్లే రోడ్డు

పేరుకే మండల కేంద్రం..

- మండలం ఏర్పాటైనా అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు
- అరకొర వసతులతో సిబ్బంది ఇబ్బందులు
- ఏళ్లు గడుస్తున్నా కార్యాలయాలకు సమకూరని సొంత భవనాలు

భీమిని/కన్నెపల్లి నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పరిపాలనా సౌలభ్యం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం నూతన మండలాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా భీమిని మండలాన్ని విభజించి కన్నెపల్లి మండల కేంద్రంగా ఏర్పాటు చేశారు. దీంతో మండల వాసులు హర్షం వ్యక్తం చేశారు. పరిపాలనా సేవలు సులువుగా లభిస్తాయని, మౌలిక వసతుల కల్పనకు అధికంగా నిధులు కేటాయిస్తారని ప్రజలు సంబరపడ్డారు. కానీ మండలంలో కనీస వసతులు కూడా అంతంతమాత్రంగానే ఉండటంతో ప్రజలకు, అధికారులకు ఇబ్బందులు తప్పడం లేదు.


ప్రారంభానికి నోచుకోని పోలీస్ స్టేషన్

పాత భవనాల్లో మండల కార్యాలయాలు..

నూతన మండలం ఏర్పాటై తొమ్మిదేళ్లు దాటినప్పటికీ సొంతభవనాలు లేకపోవడంతో శిథిలావస్థ భవనాల్లో కొనసాగుతున్నాయి. ఎంపీడీవో కార్యాలయం మండల విద్యావనరుల కేంద్రంలో ఏర్పాటు చేశారు. ఎంఈవోలను నియమించడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయం ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్నారు, ఇది ఏమాత్రం సరిపోవడం లేదు. భూ సమస్యలు రిజిస్ట్రేషన్లు వివిధ రకాల ధ్రువపత్రాల కోసం నిత్యం ప్రజలు ఇక్కడికి వస్తుంటారు. కనీస వసతులు లేక ఇబ్బందులు తప్పడం లేదు. పోలీస్ స్టేషన్ పాత సబ్ సెంటర్ భవనంలో, పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణం పూర్తి అయినప్పటికీ ప్రహరీ లేకపోవడంతో ప్రారంభానికి నోచుకోవడం లేదు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఐకేపీ కార్యాలయం నిర్వహిస్తున్నారు. వీటికి విశాలమైన వసతులతో సొంత భవనాలు నిర్మించాల్సి ఉంది.

నిలిచిన ఆయుష్ సేవలు...

దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారు ఆయుర్వేద వైద్యాన్ని నమ్ముకుంటారు. అటువంటి ఆయుర్వేద వైద్యశాలను ఉమ్మడి భీమిని మండలంలో 20 ఏళ్ల క్రితం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం యోగా కేంద్రంలో నిర్వహిస్తున్నారు. వైద్యులు సక్రమంగా రాకపోవడంతో వైద్యసేవలు పూర్తిగా నిలిచిపోయాయి. క్రమం తప్పకుండా మందులు వేసుకుంటే దీర్ఘకాలిక వ్యాధులు నియంత్రణలో ఉంటాయి. వైద్యుడు క్రమం తప్పకుండా వచ్చేలా చూసి వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

భవనాలను నిర్మించాలి....



గోమాస డాగయ్య, కన్నెపల్లి

కొత్త మండలంలో సొంత భవనాల నిర్మాణంపై దృష్టి సారించి ప్రజలకు సౌకర్యాలను చేరువ చేయాలి. కొత్త మండలానికి సొంత భవనాలు లేకపోవడం బాధాకరం. అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలకు నిధులు విడుదల చేయాలి. అన్ని కార్యాలయాలు ఒకే చోట నిర్మించి ప్రజలకు సౌకర్యవంతంగా చేయాలి. స్థలసేకరణ చేపట్టి సొంత భవనాలు నిర్మించాలి.

విచ్చలవిడిగా మొరం తవ్వకాలు

(5వ పేజీ తరువాయి)


అండాళమ్మ కాలనీలో మొరాన్ని సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు (రాత్రే మొరం మాయం అయింది)

ఉండటంతో రియల్ ఎస్టేట్ వెంచర్ల నిర్వాహకులు దానిపై ఆసక్తి కనబరుస్తున్నట్లు తెలుస్తోంది. రెండునెలల క్రితం కూడా దండేపల్లి మండలంలోని అందుగులపేట గ్రామ శివారులో సర్వే నంబర్ 9లో విస్తరించి ఉన్న గుట్టలోనూ పెద్ద మొత్తంలో మొరం, మట్టి తవ్వకాలు జరిపారు. అలాగే మండలంలోని వందురుగూడ సమీపంలోనూ పెద్ద మొత్తంలో గుట్టలో మొరం, మట్టి తవ్వకాలు జరుపుతూ ఇతర ప్రాంతాలకు తరలించారు. మొరాన్ని తరలించేందుకు వ్యాపారులు భారీ వాహనాలు ఉపయోగిచడంతో రోడ్డు గుంతలమయంగా మారడంతో గ్రామస్థులు ఆందోళనకు దిగారు. దీంతో ఆ ప్రాంతంలో మొరం తవ్వకాలు నిలిచిపోయినప్పటికీ తాజాగా రంగంపల్లెపై అక్రమార్కుల దృష్టి పడింది. దండేపల్లి మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన గూడెం సత్యనారాయణస్వామి ఆలయం విస్తరించి ఉన్న సర్వే నంబరు 226లోని గుట్టలోనూ గుట్టు చప్పుడు కాకుండా అక్రమంగా మొరం తవ్వకాలు జరుపుతున్నట్లు సమాచారం. మండలంలోని వివిధ ప్రాంతాల్లో మొరం, మట్టి తవ్వకాలు జరుపుతున్న వ్యాపారులు వాటిని ప్రభుత్వ పథకమైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి తరలించేందుకు తమకు అనుమతులు ఉన్నాయని ప్రచారం చేస్తూ పబ్బం గడుపుతున్నారు. ఒకవేళ సంబంధిత అధికారుల నుంచి అనుమతులు ఉన్నా... నిబంధనల మేరకు తవ్విన మొరం, మట్టిని కేవలం ఇందిరమ్మ ఇళ్ల అవసరాలకు మాత్రమే వినియోగించాల్సి ఉంది. అదికూడా దండేపల్లి మండల పరిధిలో మాత్రమే లబ్ధిదారులకు అందజేయాలి. ఈ విషయం మైనింగ్ శాఖ జారీ చేసిన ప్రొసీడింగులోనూ పేర్కొనడం గమనార్హం. అలా ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అనుమతులు పొందిన కాంట్రాక్టర్లు వివిధ ప్రాంతాల్లో తవ్విన మొరం, మట్టిని మండల పరిధులు దాటి ఇతర ప్రాంతాలకు తరలిస్తూ పెద్దమొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మినీ అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలి

మందమర్రిరూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సారంగపల్లి గ్రామంలోని తుర్కపల్లిలో మినీ అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రం లేక తుర్కపల్లిలోని గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందడం లేదన్నారు. కిలోమీటరు దూరంలో ఉన్న సారంగపల్లికి వెళ్లాల్సి వస్తోందన్నారు. తుర్కపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయని, వెంటనే అధికారులు స్పందించి మిని అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు.

ఉన్ని దుస్తులు వచ్చేశాయ్..

- ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారులు
- చలి పెరుగుతున్నందున స్వెటర్లపై దృష్టి



సీసీసీ కార్నర్ వద్ద అమ్మకానికి సిద్ధంగా ఉన్న స్వెటర్లు, నస్పూర్‌లో వెలిసిన తాత్కాలిక షాపులు

నస్పూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రోజు రోజుకు చలి తీవ్రత పెరగుతుంది. చలి నుంచి తట్టుకోవడానికి చలి మంటలు, ఉన్ని దుస్తులను ప్రజల దృష్టి సారించారు. గ్రామీణ ప్రాంతాల్లో సాయంత్రం కాగానే నెగళ్లను ఏర్పాటు చేస్తున్నారు. చలి నుంచి వెచ్చదనం కొరకు ప్రజలు ఉన్ని దుస్తులను ఆశ్రయిస్తున్నారు. మొన్నటి వరకు చలి ప్రభావం లేకపోవడం వలన స్వెటర్లు, చేతి గ్లౌజులు, చెవి గొడుగుల, శాలువాలపై పెద్దగా దృష్టి సారించలేదు. ఇటివల వచ్చిన తుఫాన్ ప్రభావం వలన ఒక్కసారి చలి వాతావరణం రోజురోజుకు పెరుగుతోంది. మరికొన్ని రోజుల పాటు చలి తీవ్రత మరింత ఎక్కువ ఉండే అవకాశం ఉంటుందని నిపుణులు చెప్పుతున్నందున చలి నుంచి కాపాడే దుస్తులపై జనాలు దృష్టి సారించారు. మంచిర్యాల జిల్లాలోని వివిధ పట్టణాల్లోని కూడళ్లు, ప్రధాన రహదారుల వెంట హిమాచల్ ప్రదేశ్, డీల్లి, మధ్యప్రదేశ్ నుంచి ఉన్ని వస్త్రాలను అమ్ముకోవడానికి కొందరు వ్యాపారులు ఇక్కడికి వచ్చారు. వివిధ ప్రాంతాల్లో తాత్కలిక షెడ్లను ఏర్పాటు చేసి పిల్లల నుంచి పెద్దల వరకు వినియోగించే స్వెటర్లు, చెవి గొడుగులు, గ్లౌసులు, శాలువాలు, మఫ్లర్స్ తదితర ఉన్ని వస్త్రాలను అమ్మకాలు సాగిస్తున్నారు. ఆయా ఉన్ని దుస్తులు 150 రూపాయల నుంచి వెయ్యి రూపాయలకు పైగా ధరలున్నాయి.

సాయంత్రం ఐదు గంటలకే చలి మొదలు అవుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో పంటలు సాగు చేసే రైతులు పంటలను కా పాడుకోవడానికి, ధాన్యం ఆరబోసిన చోట రాత్రి వేళలో కాపలా ఉంటారు. అక్కడ రైతులు చలి నుంచి తట్టుకోవడం కోసం కర్రలతో నెగడు మంట ఏర్పాటు చేసుకుంటారు. గ్రామాల్లో అయితే చాలా ప్రాంతాల్లో సాయంత్రం కాగానే మంట పెట్టి చలికాగుతారు. సింగరేణి ఏరియాల్లో కార్మికులు ఉదయం, రాత్రి షిఫ్టలకు వెళ్లే సమయంలో, రెండో బదిలీ రాత్రి పదిగంటల తర్వాత తిరిగి ఇళ్లకు వచ్చేవేళ చలి బారిన పడుతున్నారు. వివిధ పనుల నిమిత్తం, ప్రైవేట్ కంపెనీల్లో, వ్యాపారులు, ఇతర రంగాల్లో విధులు నిర్వహించే కార్మికులు చలి నుంచి తట్టుకునేందుకు తప్పని సరిగా ఉన్ని వస్త్రాలను కొనుగోలు చేయాల్సి వస్తోంది. వచ్చే వారం రోజుల పాటు చలిమరింత ఎక్కువ ఉండే అవకాశం ఉంటుందని నిపుణలు చెబుతున్నందున ఉన్ని దుస్తుల కొనుగోళ్లు ఊపందుకోనున్నాయి.

గ్రామ సమాఖ్య సంఘాలను బలోపేతం చేయాలి

జైపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామ సమాఖ్య సంఘాలను బలోపేతం చేసేలా చర్యలు తీసుకోవాలని మండల సమాఖ్య అధ్యక్షురాలు మాలతి పేర్కొన్నారు. మహాలక్ష్మి మండల సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం సీఆర్‌పీల బ్రీతింగ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళ సంఘాలు మండల సమాఖ్యలో సమావేశాలు నిర్వహిస్తూ ఆర్థికపరమైన పనితీరును సమీక్షించుకోవాలన్నారు. ఎక్కడ లోపాలున్నాయో గుర్తించి సరిదిద్దుకోవాలన్నారు. రికవరీలను మెరుగుపర్చి గ్రామ సంఘాలు మండల సమాఖ్యలు మరింత బలపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామసంఘాల ప్రతినిధులకు ఆటలపోటీలు నిర్వహించి గెలుపొందిన వారిని సన్మానించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ

కోటపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలో మంగళవారం కోటపల్లికి చెందిన పనకంటి కపిల్‌కుమార్ నిరుపేద వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. చలి తీవ్రమవుతున్న దృష్ట్యా నిరుపేదలకు దుప్పట్లు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మిత్రబృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ


చెక్కులను అందజేస్తున్న తహసీల్దార్, నాయకులు

లక్షెట్టిపేట, నవంబరు, 11(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పట్టణంలోని రైతు వేదికలో మండలంలోని 427మంది లబ్దిదారులకు మంజూరు అయిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేమ్‌చంద్ చేతులమీదుగా మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్‌కుమార్, ఆర్టీఏ మెంబర్ అంకతి శ్రీనివాస్, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ ఎండి.ఆరీఫ్, పార్టీ మండల అధ్యక్షుడు పింగిళి రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్‌కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నలిమెల రాజు, నాయకులు తోట రవి, కందుల మోహన్, వెంకటస్వామిగౌడ్, రవీందర్, అమీర్, దేవా తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

చెన్నూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక ఏర్పాటు చేసినట్లు విద్యుత్ ఎస్ఈ ఉత్తమ్‌జాడే, డీఈ కైసర్, ఏడీఈ బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నూరు, భీమారం, కోటపల్లి, జైపూర్ మండలాల పరిధిలోని వినియోగదారులు సమస్యలపై ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు.

గ్రూప్-2 సాధించిన యువకుడికి సన్మానం

దండేపల్లి నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):దండేపల్లి మండలం చెల్కగూడ గ్రామానికి చెందిన చింతల లక్ష్మి-సత్తయ్య దంపతుల పెద్ద కుమారుడు ప్రమోద్‌కు ఇటీవల గ్రూప్2లో (ఎంపివో)గా ప్రభుత్వ ఉదోగ్యం సాధించాడు. దీంతో మంగళవారం పత్తిపాక శ్రీనివాస్ ఆధ్వర్యంలోగ్రామస్థులతో కలిసి ప్రమోద్‌ను శాలువతో ఘనంగా సత్కారించి అభినందించారు. కార్యక్రమంలో చెల్కగూడ గ్రామస్థులు పాల్గొన్నారు.

బేటీ బచావో, బేటీ పడావోపై అవగాహన

చెన్నూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అస్నాదలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో విద్యార్థులకు బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంపై మంగళవారం అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిరోధక చట్టం, ఆన్‌లైన్ సేఫ్టీ, సైబర్ క్రైం, మహిళ, చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్ల గురించి మహిళ సాధికారతపై హబ్ జెండర్ స్పెషలిస్టు విజయ వివరించారు. ఇన్‌చార్జి హెచ్ఎం సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక పూజలు


సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు

దండేపల్లి నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్తీక బహుళ సప్తమి సందర్భంగా దండేపల్లి మండలం గూడెం సత్యనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం వందలాది మంది భక్తులతో తరలివచ్చి కార్తీక పూజలను నిర్వహించారు. ఉదయం గోదావరి నదిలో భక్తులు కార్తీక పుణ్యస్నానాలు ఆచరించి, కుటుంబసమేతంగా భక్తులు గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి నదిలో కార్తీక దీపాలను వదిలారు. అనంతరం సత్యదేవుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలతో కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. వందలాది మంది భక్తులు కుటుంబ సమేతంగా స్వామి వ్రతాన్ని నోముకొని పూజలు చేశారు. ప్రదానలయం ధ్వజ స్తంభం, రావి చెట్టు వద్ద భక్తులు కార్తీక దీపాలు వెలింగించి పూజలు చేశారు. దీంతో ఆలయం వద్ద భక్తులతో కార్తీక శోభ సంతరించుకుంది.

పోస్టల్ బీమా చెక్కు అందజేత

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇండియా పోస్ట్ పేమెంట్స్ ఖాతాదారుడు అందె విజయ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా అతని కుటుంబానికి రూ. 10 లక్షల బీమా చెక్కును కలెక్టర్ కుమార్ దీపక్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విజయ్ ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకులో 520 రూపాయలతో ప్రమాద బీమా పాలసీ తీసుకున్నాడని, ఇటీవల హైద్రాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడన్నారు. తపాలా కార్యాలయం, టాటా గ్రూప్ ఆక్సిడెంటల్ గార్డ్ క్లెయిమ్ సెటిల్ కాగా బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేశామని వివరించారు. జిల్లాలో ఈ పథకంలో 20 వేల మంది పాలసీ తీసుకున్నారని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ తిరుపతి, పోస్టల్ బ్యాంకు సీనియర్ మేనేజర్ శ్రీనివాస్, హెడ్ పోస్టుమాస్టర్ కుమారి, ఐటీఐ ప్రిన్సిపల్ రమేష్, పోస్టల్ మేనేజర్ సాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

అందెశ్రీ మృతి సాహితీ లోకానికి తీరని లోటు



జన్నారంలో మౌనం పాటిస్తున్న విద్యార్థులు, హైదరాబాద్‌లో అందెశ్రీ అంతిమ యాత్రలో సారథి కళాకారులు

కాసిపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సహజకవి అందెశ్రీ మృతిపై ప్రజాసంఘాల నాయకులు మంగళవారం మండల కేంద్రంలో ఘనంగా నివాళులర్పించారు. ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజా స్పందన వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు సిలోజు మురళి మాట్లాడుతూ ప్రజాకవి అందెశ్రీ హఠాన్మరణం సాహితి లోకానికి తీరని లోటన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో అందెశ్రీ ఆటపాటల ద్వారా ప్రజలందర్ని ఒక్కతాటిపైకి తెచ్చార న్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు గోనెల శ్రీనివాస్, సిరాజ్‌ఖాన్, వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

జన్నారం: తెలంగాణ గేయ రచయిత, ఉద్యమకర్త అందెశ్రీ హఠాన్మరణంతో మండలంలోని రాఘవేంద్ర కరిమిల కళాశాల విద్యార్థులు మంగళవారం రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు ఆర్పించారు. ఈసందర్భంగా కళాశాల కరస్పాండెంట్ చంద్రశేఖర్ మాట్లాడుతూ అందేశ్రీ చేసిన సేవలను కొనియాడారు.

అంతిమయాత్రలో సారథి కళాకారులు..

మంచిర్యాల కలెక్టరేట్: హైద్రాబాద్‌లో మంగళవారం జరిగిన ప్రజా కవి అందెశ్రీ అంతిమ యాత్రలో తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు పాల్గొని ఆయనకు నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు కొప్పర్తి సురేందర్, టీం లీడర్ సల్లూరి కృష్ణ, పోశం, శ్రావణ్‌కుమార్, కొప్పర్తి రవీందర్, శ్రీనివాస్, లింగంపల్లి రాజేష్, కాసిపేట సంతోష్ నివాళులర్పించారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

బెల్లంపల్లి,నవంబరు11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మంగళవారం వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మికంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలను పాటించాలని సూచించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనం నడిపేవారి వివరాలు, లైసెన్స్‌లు, ధ్రువీకరణ పత్రాలు, వాహనాల్లో తరలిస్తున్న వస్తువులను పరిశీలించారు. నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధించారు. అలాగే కాల్‌టెక్స్ ఫ్లైఓవర్ బ్రిడ్జీపైన టూటౌన్ ఎస్ఐ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేపట్టారు.

తాండూర్: తాండూర్ ఐబీలో పోలీసులు మంగళవారం రాత్రి విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశారు. డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ దేవయ్య మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం తాగి వాహనాలు నడపవద్దన్నారు. వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనాలపై ముగ్గురు వెళ్లవద్దని, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించుకో వద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ కిరణ్‌కుమార్, పోలీసులు పాల్గొన్నారు.


బెల్లంపల్లిలో వాహనాలను తనిఖీ చేస్తున్న వన్‌టౌన్ సీఐ, పోలీసులు

పిరమిడ్ ధ్యానకేంద్రం ఆధ్వర్యంలో శాకాహార ర్యాలీ

బెల్లంపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంఘ మిత్ర ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం సుభాష్ పత్రిజి జన్మదిన సందర్భంగా ధ్యానులు శాకాహార ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని సంఘ మిత్ర ధ్యాన కేంద్ర పిరమిడ్ నుంచి మార్కెట్ బజార్ ఏరియా మీదుగా ర్యాలీ కొనసాగింది. శాకాహార విశిష్టతను వివరిస్తూ ర్యాలీ చేపట్టారు. అనంతరం ధ్యాన కేంద్రంలో హిమాలయ యోగి సీనియర్ పిరమిడ్ మాస్టర్ కళాధర్ రెడ్డి ఆధ్వర్యంలో ధ్యాన తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, యోగా సాధకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న సంఘమిత్ర పిరమిడ్ ధ్యానకేంద్రం సభ్యులు

నీల్వాయిలో యూనియన్ బ్యాంక్ ప్రారంభం

వేమనపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీల్వాయి గ్రామంలో యూనియన్ బ్యాంక్ సేవలను ఆ సంస్థ ఏజీఎం సురేశ్, ఎల్‌డీఎం తిరుపతి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఏజీఎం మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో ప్రజలకు యూనియన్ బ్యాంక్ సేవలను అందించేందుకు నీల్వాయి గ్రామంలో యూనియన్ బ్యాంక్ ఏర్పాటు చేయడం ఎంతో సంతోషకరమని తెలిపారు. బ్యాంక్ సేవలను నీల్వాయి పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చెన్నూర్ బ్రాంచి మేనేజర్ శ్రీనివాస్, నీల్వాయి టీజీబీ బ్యాంక్ మేనేజర్ రాజబాపు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పురాణం లక్ష్మీకాంత్, మాజీ సర్పంచ్‌లు రుద్రభట్ల లక్ష్మీనారాయణ, బోరుకుటి సంతోష్, రాజలింగు, మధూకర్, పీఏసీఎస్ చైర్మన్ కుబిడే వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

అందెశ్రీ మృతి తెలంగాణకు తీరని లోటు

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అందెశ్రీ మృతి తెలంగాణకు తీరని లోటని బీసీ జేఏసీ చైర్మన్ రూపనార్ రమేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో మంగళవారం అందెశ్రీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహజ కవి అందెశ్రీ మట్టి వాసనలో నుంచి అక్షరాలను పుట్టించిన ప్రజాకవి అని కొనియాడారు. ఆయన మరణం తీరనిలోటన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు వెంకన్న, మారుతి, ప్రణయ్, సాయికృష్ణ, నాందేవ్, హనుమంతు పాల్గొన్నారు.

సీపీఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలి

వాంకిడి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 26న నిర్వహించే సీపీఐ వందేళ పండగ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని సీపీఐ నాయకులు కోరారు. మండల కేంద్రంలో మంగళవారంశతాబ్ది ఉత్సవాలకు సంబందించి పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఉత్సవాలకు 40 దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని, ఇందులో భాగంగా ఈ నెల 15న కెరమెరి మండలం జోడేఘాట్ నుంచి బస్సు జాత ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు కార్యక్రమంలో నాయకులు చిరంజీవి, ప్రకాష్, మహేష్, రాకేష్, దత్తు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

- లైసెన్స్ దక్కిన వారితో లిక్కర్ వ్యాపారుల మంతనాలు
- జిల్లాలో రూ.1.14కోట్లు పలికిన ఓ మద్యం షాపు
- డిసెంబరు 1 నుంచి కొత్త దుకాణాల ఏర్పాటు
- డబ్బులు తీసుకోని వారిని భాగస్వామిగా చేర్చుకునే యోచన


లక్కీడ్రా ద్వారా మద్యం దుకాణాలు కేటాయిస్తున్న అధికారులు (ఫైల్)

మద్యం దందాకు గుడ్‌విల్ టెండర్

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మద్యం టెండర్లలో షాపులు దక్కిన వారికి వ్యాపారం చేయకుండానే కాసుల వర్షం కురుస్తోంది. ఇటీవల ఎక్సైజ్ శాఖ నిర్వహించిన మద్యం టెండర్ల లక్కీ డ్రాలో వైన్స్‌లు దక్కని లిక్కర్ వ్యాపారులు లక్కీ డ్రాలో వచ్చిన వారితో బేరసారాలను మొదలు పెట్టారు. తమకు దుకాణం అప్పగిస్తే భారీగా నజరానా ఇస్తామంటూ గాలం వేస్తున్నారు. ఎలాంటి అనుభవం లేకున్నా లక్కీ డ్రాలో అదృష్టం వరించిన వారికి లక్ష్మీ కటాక్షం లభిస్తోంది. ఒక్కో వైన్స్ ధర రూ. 85 లక్షల నుంచి 1.40 కోట్ల వరకు పలుకుతోంది. ఏరియాను బట్టి రేటు మారుతోంది. ఇప్పటికి చాలా దుకాణాలు చేతులు మారినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న వైన్‌షాపుల గడువు ఈనెల 30వ తేదీతో ముగియనుంది.

• జిల్లాలో 680 దరఖాస్తులు..

జిల్లా వ్యాప్తంగా 680 మంది వైన్‌షాపుల కోసం దరఖాస్తు చేసుకున్నారు ఎక్సైజ్‌శాఖ 2025-2027కు సంవత్సరాలకు వైన్స్‌ల నిర్వహణకు టెండర్లు పిలిచింది. సెప్టెంబరు 26వ తేదిన నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అక్టోబరు 23వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించింది. అక్టోబరు 27వ తేదిన లక్కీ డ్రా పద్ధతిలో వైన్ షాపులను కేటాయించారు. కాగా ఆసిఫాబాద్ డివిజన్‌లోని కెరమెరి మండలంలోని గోయగాం వైన్‌షాపు దక్కిన వ్యక్తి దాన్ని అమ్మకానికి ఆసక్తి చూపడంతో రూ. 1.14 కోట్లకు విక్రయించారు. వాంకిడి మండల కేంద్రంలోని ఒక షాపు రూ. 1.20 కోట్లు, కాగజ్‌నగర్ మండలంలోని ఈస్‌గాం షాపు రూ. కోటి, బెజ్జూర్ మండల కేంద్రంలోని షాపు రూ. కోటికి విక్రయించనున్నట్లు సమాచారం. మిగతా మండలాల్లో సైతం పాత వ్యాపారులు సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. లిక్కర్ వ్యాపారానికి అలవాటు పడి పెద్ద మొత్తంలో లబ్ధి పొందిన వ్యాపారులు లక్కీడ్రాలో దక్కని వారు గుడ్‌విల్ అకౌంటింగ్‌తో దక్కించుకునేందుకు తెరలేపారు. డబ్బులు తీసుకోని వారిని భాగస్వామిగా చేర్చుకునే యోచనలో ఉన్నట్లు చెబుతున్నారు.

• లెక్కల్లో వ్యాపారులు..

జిల్లాలోని ఏ మద్యం దుకాణం లెక్కలు చూసిన ఏడాదికి రూ. 2 కోట్లకు తక్కువగా లేదంటూ వ్యాపారులు లెక్కల్లో తేలింది. దీంతో ప్రభుత్వానికి చెల్లించే రెంటల్‌కు పదింతలు అమ్మకాలకు మొదటగా 16 నుంచి 20 శాతం మార్జన్, ఆ తర్వాత విక్రయించే మద్యానికి 6 నుంచి 10 శాతం మార్జిన్ ఉండడంతో మద్యం దుకాణాలను ఎలగైనా దక్కించుకోవాలని సిండికేటు వ్యాపారులతో పాటు తమ దుకాణాలను తామే సొంతంగా నడుపుకుంటా మంటూ కొత్త వ్యా పారులు సిద్ధవుతున్నారు. మండలాల్లో గ్రామాల వారీగా బెల్టుషాపు నిర్వహకులను కలిసి ఈసారి వైన్‌షాపులు తమకే వచ్చిందని ఇక్కడే మద్యం తీసుకోవాలని ముందుగానే చర్చలు మొదలు పెట్టారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం అశోక్

ఆసిఫాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిరుద్యోగ యువతకు అందిస్తున్న అవకావాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ మధిరె అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో మంగళవారం జిల్లా పరిశ్రమల కేంద్రం ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఆర్ఏఎంపీ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు అందిస్తున్న అవకాశాలను వినియోగించుకోవాలని తెలిపారు. వీధి వ్యాపారుల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి స్వనిధి పథకంపై అవగాహన కల్పించారు ఆర్ఏఎంపీ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం యువతకు పారిశ్రామిక వేత్తలుగా ఎదగానికి అవకాశాలను కల్పిస్తుందని పథకం నిబంధనల ప్రకారం పరిశ్రమలను స్థాపించి అభివృద్ధి చెందాలని తెలిపారు. ప్రధాన మంత్రి స్వయం ఉపాధి పథకం విశ్వకర్మ, పీఎంఎఫ్ఎంఈ, టి-ప్రైడ్, టి-ఇండియా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ, మెప్మా అధికారి మోతిరాం, ఈడీసీ మేనేజర్ నిఖిల్ పాల్గొన్నారు.

ఈసుగాం శివమల్లన్న ఆలయంలో పూజలు

కాగజ్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈసుగాం శివమల్లన్న ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సామూహికసత్యనారాయణ వ్రతాలను నిర్వహించారు. కార్యక్రమంలో వేద పండితుడు నరహరి శర్మ, పూజారి సంతోష్ శర్మ, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న 2012 బ్యాచ్ విద్యార్థులు, లెక్చరర్లు

కాగజ్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 2012 బ్యాచ్ విద్యార్థులు ఒక్క చోట కలుసుకుని గత స్మృతులను గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆనాడు తమకు పాఠాలు చెప్పిన లెక్చరర్లను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అబ్దుల్లా, అధ్యాపకులు మంజుల, రవికుమార్, ఆనంద్ కుమార్, ప్రసాద్, రహీం పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

రెబ్బెన, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక ప్రశాంతత లభించనుందని యోగా తెరపిస్ట్ షణ్ముఖ శివ శర్మ అన్నారు. గోలేటి జీఎం కార్యాలయంలోని మంగళవారం కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులు, ఉద్యోగులకు యోగా, ప్రాణాయామం, ఆహార నియమాలపై అవగాహన కల్పించారు. యోగాసన చిట్కాలను చూపించారు. ఆరోగ్యాన్ని మించిన సంపద లేదని నిత్యం అరగంట పాటు యోగా సాధన నూరేళ్ల ఆరోగ్య జీవనాన్ని మూలం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో జీఎం విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, ఇంజనీర్ కృష్ణమూర్తి, ఎస్ఓటు జీఎం రాజమల్లు, హెచ్ఓడీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల విడుదల

కెరమెరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలంలో కుల దురహంకార హత్యకు గురైన శ్రావణి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ఈ నెల 22న చేపట్టనున్న చలో కలెక్టరేట్ పోస్టర్లను మంగళవారం ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చలో కలెక్టరేట్ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో భీంరావు, జంగు, మాణిక్‌రావు పాల్గొన్నారు.

నేడు నెట్‌బాల్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో బుధవారం ఉమ్మడి జిల్లా స్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నామని డీఐఈవో రామదాసు, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ బాబురావు, ప్రిన్సిపాల్ మహేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు పీడీ తిరుపతిని సంప్రదించాలని సూచించారు.

రోగులకు పండ్లు పంపిణీ

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మాజీ కేంద్ర మంత్రి హన్స్‌రాజ్ గంగారాం అహిర్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని మంగళవారం బీజేపీ నాయకులు ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశాల్, రాధిక, గణేష్, సతీష్, కార్తీక్, కుమార్, సాయి, నవీన్, రాజ్ పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

బెజ్జూరు, నవంబర్ 11 (ఆంధ్రజ్యోతి): జోడేఘాట్‌లో ఈ నెల 16న నిర్వహించే ఆదివాసీ టీచర్స్ అసోసి యేషన్(ఆట) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు కోరారు. మండల కేంద్రంలో మహాసభల పోస్టర్లను మంగళవారం విడుదల చేశారు. కార్యకరమంలో వెంకటేశ్వర్, రమేష్, తిరుపతి, రాజారాం, హనుమంతు, భుజంగరావు, విజయ కుమార్, భువనేశ్వరి, సురేష్, రవీంద్రనాథ్, రాములు పాల్గొన్నారు.

మైనార్టీల సమస్యలు పరిష్కరించాలి

కాగజ్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని జమియతుల్ ఉలమా ప్రతినిధుల బృంద సభ్యులు మంగళవారం కాగజ్‌నగర్ తహసీల్దార్, సబ్‌కలెక్టర్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బషీరుద్దీన్, టీఆర్ఎస్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు జాకీర్‌షరీఫ్, జమా మసీద్ అధ్యక్షుడు హాజీ, కార్యదర్శి ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐతో బోధన విద్యార్థులకు వరం

ఆసిఫాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏఐ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్)తో బోధన విద్యార్థులకు వరమని అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి డీఈవో దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులతో మంగళవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏఐ బోధన, విద్యార్థుల హాజరు శాతం పెంపుదల, నాణ్యమైన విద్య, బోధన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా అందిస్తున్న బోధనలో విద్యార్థుల పురోగతి సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయలని తెలిపారు. ఉపాధ్యాయులు ప్రతి రోజు విద్యార్థులను పర్యవేక్షించాలని చెప్పారు. విద్యార్థుల పఠన సామర్థ్యాలను పెంపొందించాలని తెలిపారు. ప్రశ్నలకు జవాబులు ఇవ్వడంలో తప్పులు చేస్తున్న విద్యార్థులను గుర్తించి వారికి అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని సూచించారు. ఏఐ బోధన ద్వారా తెలుగు, ఇంగ్లీష్, మ్యాథ్స్ సబ్జెక్టులలో విద్యార్థులు పురోగతి సాధించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. విద్యార్థులు పాఠశాలకు వంద శాతం హాజరయ్యేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థులు ప్రతి రోజు క్రమం తప్పకుండా పాఠశాలలకు హాజరయ్యేలా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఆయన చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి డీఈవో దీపక్ తివారి మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధికి అబుల్ కలాం ఆజాద్ ఎనలేని కృషి చేశారని కొనియాడారు. అబుల్ కలాం ఆజాద్ జయంతి, మైనార్టీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యాదినోత్సవాలను పురస్కరించుకొని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యలో ఏర్పాటు చేసిన వేడుకలకు డిప్యూటీ కలెక్టర్ జాస్టిన్ జోల్, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి నదీమ్, మైనార్టీ ప్రతినిధులతో కలిసి హాజరై ఆజాద్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దీపక్ తివారి మాట్లాడుతూ దేశ విద్యాశాఖ మంత్రిగా అబుల్ కలాం ఆజాద్ అందించిన సేవలు చిరస్మరణీయమని చెప్పారు. ఆజాద్ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించారని, భారత ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలి విద్యాశాఖ మంత్రిగా పని చేసి విద్యారంగ అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అలీబీన్ అహ్మద్, జిల్లా మార్కెటింగ్ శాఖాదికారి అశ్వక్ అహ్మద్, తహసీల్దార రియాజ్ అలీ, మైనార్టీ సంఘాల ప్రతినిధులు ఫయాజ్, రహమాన్, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలి

సిర్పూర్(టి), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. సిర్పూర్(టి) మండలం చీలపల్లి జీపీలోని పూసిగూడ గ్రామంలోని పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల పని తీరు, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సక్రమంగా పెట్టాలని అన్నారు. ఉపాధ్యాయులు నిర్లక్ష్యం చేయరాదన్నారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ, ఉన్నారు.

రేపు విగ్రహ ప్రతిష్ఠ

కౌటాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కౌటాల మండలంలోని కంకాళమ్మ గుట్టపై జాతరాను పురస్కరించుకుని గురువారం శ్రీ రామసహిత సత్యనారాయణస్వామి గరుత్మంతుడు విగ్రహం ప్రతిష్ఠంచనున్నామని ఆలయ కమిటీ చైర్మన్ సుల్వ కనకయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతర ప్రారంభంతో పాటు సామూహిక సత్యనారాయణ వ్రతం ఉంటుందని తెలిపారు.

అపురూపం.. బంగారు వర్ణం



వర్ణం.. అందులో ఉండే అందం. ఆకర్షణ అపురూపం.. అనిర్వచనీయం. ఏ రంగయినా ఆలోచనలు రేకెత్తిస్తుంది. చూపరులకు ఆహ్లాదం కలిగిస్తుంది. ప్రకృతి ఎన్నో వర్ణాలకు నెలవు. రుతువును బట్టి రూపులు మారుస్తూ ఆహ్లాదం పంచడం ప్రకృతి తీరు. మండలంలోని గుంట్లపేట గ్రామ శివారులోని పంట పొలాల్లో సూర్యోదయం వేళలో బంగారు వర్ణం ఆకట్టుకున్నది. మంగళవారం ఉదయం సూర్యకిరణాలు కోత దశలో ఉన్న వరి పైరుపై పడడం కనువిందు చేసింది.

- పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి)

యువకుడి దాతృత్వం.. సొంత డబ్బులతో వీధి లైట్లు ఏర్పాటు

జైనూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పవర్‌గూడలో తురసం రాజు అనే యువకుడి దాతృత్వంతో మంగళవారం సొంత డబ్బులతో వీధిలైట్లు ఏర్పాటు చేయించడంతో పలువురు ఆయనను అభినందించారు. ఇటీవల కాలంలో పంచా యతీల్లో నిధులు లేకపోవడంతో వీధి లైట్లను పంచాయతీ సిబ్బంది ఏర్పాటు చేయడం లేదు. దీంతో రాత్రి వేళల్లో గ్రామంలోని వీధుల్లో అంధకారం నెలకొని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రజల ఇబ్బందిని గమనించి పవర్‌గూడ గ్రామానికి చెందిన యువ నాయకుడు తురసం రాజు సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి విద్యుత్ దీపాలు కొనుగోలు చేసి గ్రామంలో ఏర్పాటు చేయించడారు. ఇందుకోసం సుమారు రూ. 30వేలు వెచ్చించి 150 ఎల్ఈడీ లైట్లు కొనుగోలు చేశామని రాజు తెలిపారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీలకు పాలకవర్గం లేక పోవడంతో నిధులు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు.

వ్యాసరచన పోటీల్లో బహుమతులు సాధించిన విద్యార్థులు


ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థులు

వాంకిడి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): టి-శాట్ ఎడ్యూకేషన్ చానల్, తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ హెడ్మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలో నిర్వహించిన జిల్లా స్థాయి వ్యారచన, ఉపన్యాస, క్విజ్ పోటీల్లో వాంకిడి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి ప్రథమ బహుమతులు సాధించారు. వ్యాసరచన పోటీల్లో జిల్లా స్థాయి ప్రథమ బహుమతి శ్రావణి, క్విజ్‌లో వంశీ ప్రథమ బహుమతులు సాధించారు. వీరు ఈ నెల 13, 14 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా తరఫున ఎంపిక కావడంతో ప్రధానోపాధ్యాయుడు నటరాజ్, ఉపాధ్యాయులు అబినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలని సూచించారు.

ధర్మపోరాట దీక్షకు బీసీలు తరలిరావాలి


మాట్లాడుతున్న బీసీ జేఏసీ చైర్మన్ రూప్‌నార్ రమేశ్

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బీసీలకు విద్యా, ఉద్యోగ,రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరుతూ గురువారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో చేపట్టనున్న ధర్మపోరాట దీక్షకు బీసీలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ రూప్‌నార్ రమేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు తప్పినిసరిగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు చేపట్టే ధర్మ పోరాట దీక్షను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రణయ్, మారుతి, వెంకన్న, సాయికృష్ణ, నాందేవ్, హనుమంతు పాల్గొన్నారు.